నా కు నచ్చిన నా కథ

# యెలుగు మింగిన శీకటి

డా|| దేవరాజు మహారాజు

*సరిగ రొండు జాములకు అయిలయ్య, ఆని పెండ్లం సత్తెమ్మ, పెద్ద కొడుకు పోశాలు కలిసి పెరట్ల గోడ గడ్తాంర్రు. గా ఒక్క గోడ గడితె ఆల్లకది యింకో అర్రయితది. గింత గింజ గిరువు వోసుకుంటందుకు, ఎవుసం సామాన్లు బెట్టుకుంటందుకు అయిద్దని నాలుగైదు రోజుల సంది కట్టుకం మొదల్జేశింర్రు. అయిలయ్య గోడ సాకం జూసుకుంట కూనిరాగం దీస్తాండు.*

*"ఏటికి యాతం బెట్టి ఎయ్యి పుట్లు పండిస్తే ఎన్నడొౘక మెతుకెరుగనన్నా, గంజిలొౘక మెతుకెరుగ నన్నా... నా యాతెమెప్పుడు దీరునన్నా..."*

*"ఆఁ, సాల్ సాల్ పని గానియ్. ఎమో గిప్పుడే పదాలు సురూ జేస్తివి పొందుగ గూసోని? నాకీడ నిలవడి నిలవడి ఒల్లు దిర్గుతాంది. పానం కులాస లేక..." యాష్ట కొచ్చింది సత్తెమ్మ.*

సత్తెమ్మ కోపాని కొత్తె, అయిలయ్య మన్సుల నగిండు. ఇంక జెర్ర దిల్లగి జేద్దామనుకున్నడు. అచ్చం ఆదిబట్లో నోలె నోరు దిప్పుకుంట "ఏందేయ్-ఒల్లు బాగ లేకుంటె మందు దింటనే వుంటివి. కల్లు గిన దాగినవేమో ఒల్లు దిర్గుతాంది-

"మందు దింటున్నాను మొగడో మందు దింటున్న,

మందు పత్తెం దీరెదాక మందలియ్యాకు
మడత రొట్టెలు పొంగె కల్లు
వూరి మీది కోడిపిల్లలు మందు దింటున్న.
ఆరు శేర్ల అరిసెంత పప్పు
నానబోసి గారెల్జేసి మందు దింటున్న..."

అయిలయ్య పాటకు సత్తెమ్మ మొకమంత, మాడు శెక్కోలె జేసుకున్నది.

పోశాలుకు అయ్య పాట ఇశిత్రమనిపిస్తాంది.

అయిలయ్య కుశయిండు. ఊటగా మల్లందుకున్నడు.

"నానబోసి గారెల్జేశి
మందు దింటున్నాను మొగడో మందు దింటున్న.
పోరి కొక్కాటియ్యలేదు పోరనికి ఇయ్యలేదు
కక్కుకుంటూ ఒక్కదాన్నే మెక్కి తింటినీ
గొర్రె కూర వొండుకొని మర్రి కింద కూసోని,
మంచి కుండ కల్లు తోని మందు దింటున్నా..."

అయిలయ్య పదం పురాగ్గాక సత్తెమ్మ తిట్టుడు సురూ జేసింది. "ఛ, పరాశ్కపోనోలె ఎంత చక్కని పదం బాడవడ్తివి? సొక్కనయ్య, ఎన్కటి ముందట్కి ఎన్నడో గొర్రె కూర కల్లు కుండ దెచ్చి పెట్టినట్టు పాడ్తానవ్. ఏమన్న శరమున్నాది? నీ యవ్వ పంచిచ్చిందా? నీ యన్న పంచిచ్చిండా? పెయి మీది కట్టుబట్టతో నెల్లగొడ్తె కష్టం జేస్కోని, శెమట బోసి యింత యిల్లు వాకిలి జేసుకున్న. ముందట్నించి గట్ట దినే దాన్నయితె నువ్వు ఇయ్యాల్లటికి బుడ్డ గోశి బెట్కోని యాడ వోదువో సన్నాసులల్ల...!" సత్తెమ్మ అయిలయ్య మీదికి ఎగవడ్డది. "మొన్నటి దాక పండి పండి జెరంతోని, లేశి పన్జేత్తున్నా యింత యిది లేదు. ఎక్కడ దిక్కుమాలినోనివో నా గండానికి దొర్కినవ్!" ఎగవడుడంత ఏడ్పయిపోయింది.

సత్తెమ్మ యేడ్పు సూశి అయిలయ్య మన్సు నీల్లయింది. "ఎహె, ఏడ్వకు. నీ యవ్వ. నేనేదొ గమ్మత్కంటి-నివొద్గినె యేడుస్తదేందిరా నీ యవ్వ?" పోశాల్ను సూసుకుంట అన్నడు అయిలయ్య. సత్తెమ్మను ఇగ ఏమనొద్దు అంటనుకున్నడు.

సత్తెమ్మ లోపల్లోపల గునుస్తనె వుంది. 'నడీడు రాబట్టి పదాలు మానడాయె, సరసం మానడాయె!' అన్కోని పదం యాజ్జేసుకోని, 'నీ పదంకు నా బారేద్దు. యాణ్నేరిశిండో కన్నిద్దెల మారోడు' అనుకుంది.

ఎండేమో మా వుడక గొడ్తాంది. కండల్గరిగి శెమటయేటట్టు. ఇగ సత్తెమ్మ పెయ్యి బాగలేదు. గా మొన్న పేటకు బోయి డాక్సరు తాన సూదుల్దీస్కొనొచ్చింది. జెర్ర నయమైంది నిన్నియాల్ల.

పోశాలేమో మన్ను కశ్శె పిశ్శె తొక్కి వొంగి పారతోని మన్ను గుంజి యిస్తాండు. శేత గాకున్న, శేశెటోల్లెవ్వల్లేరని-మన్నందుకోని ముద్దల్జేసి గోడ మీద మొగన్కి యిశిరేస్తాంది సత్తెమ్మ. అయిలయ్య మన్ను తోడెం తోడెం దీసుకుంట, సర్సుకుంట గోడ పొందుగ వెడ్తాండు. "బుచ్చాలాడ వోయింది? జెర బిలువ్, పసుల నిడ్వాల్నాయె, పొద్దొగ బట్టె, ఈడనేమొ పని గాకపోతుండె" అంటన్నడు అయిలయ్య.

"ముదనష్టపొ్వరి యేడవోయిందో యేమో! నోరంత బొంగ బిల్చినా రాదు" అని అన్కుంటనే నిల్శింది సత్తెమ్మ. "బుచ్చాలూ...ఓ బుచ్చాలూ! ఏడ సచ్చినవే, నీ మీద మన్ను వడ! ఎదిగిన బిడ్డ వున్నట్టే గని గీడున్న పుల్ల గాడ వెడ్తదంటని ఆశ లేకపాయె" అన్కుంట తిడ్తనే వుంది.

బుచ్చాలు యాణ్నించో ఉర్కొచ్చింది. బుచ్చాలుకు బుగులయింది. అయ్యైతె గోడ దిగి రాడుగని, అవ్వ గిన కొడతదేమోని...గింతసేపు ఒనమోల్లింట్ల ఓనగుంట లాడొచ్చినందుకు.

సత్తెమ్మ పని మీదుండె గాబట్కె జంగిలి మాటలు దిట్టి ఊరుకున్నది. కని, కొట్టలే-గంతే సాలనుకుంది బుచ్చి.

"గా దొడ్లకు బోయి గొడ్ల నిడ్వు ఫో! జెర మేత మేస్తయ్" కోపం దీరినంక అన్నది సత్తెమ్మ.

దొడ్డి యాణ్నో లేదు. యింటె కాణ్నించి పదడుగులేస్తె గదె-దొడ్లె శాన వసురం వుంది గని అయన్ని వీండ్లయి గావు. పైల్లీర సామియి, జట్ట లచ్మిగానియి, గుండెబొయిన మైసయ్యయి, నామాల యాదిరెడ్డియి, కుకునూరి అనువాండ్లయి అందరియి గల్సున్నయ్.

సుక్కలావు, పిల్లి కండ్ల బర్రె, వల్ల దుడ్డె, ఒంకర కొమ్ముల దున్న-గీ నాలుగే అయిలయ్యయి...

బుచ్చాలు మల్ల మాట్లాడకుండ గమ్మున ఎన్కకు దిరిగింది. అవ్వ జెప్పిన పని జేద్దామనికని మల్ల ఒనమోలింటికే వొయి ఓనగుంట లాడ్దామనిపిచ్చింది. అల్లింట్ల

శిన్న బిడ్డ పేరు శెంద్రి. ఎన్నాటలాడ్తది? ఎన్ని వదాలు పాడ్తది? పోయి నేర్పమంటె సాలు, యాష్ట లేకుండ శెప్తది. ఇయ్యాల్ల అంబటాల్లప్పుడు పసందైన పదం బాడింది.

"నాగసరం బాడుకుంట
నడి బాటల కెల్లి రాంగ
నాగసరం నాదులకయ్యా నా రామయ్య
నడుములో జల్ జల్ మనెనయ్య
వద్దనాపు-అడవిలోనె,
నీ అడుగు గురుతు బట్టి,
మొగిలి పువ్వు అనుకోనయ్య నా రామయ్య!
మొక్కి వొల్లె దాసుకుంటయ్య"-పదం

యాదికి రాంగనె మన్సంత సల్లగైంది. రోజు వొయ్యి రోజుకో పదం నేర్వాలె-అనుకుంది బుచ్చాలు.

"ఓ పొల్లా...! బుచ్చాలూ...!"

యింతలకే తల్లి మల్ల బిల్శినట్టుందని ఆగింది.

"ఇగో మల్ల గిట్ట ఎవ్వలింద్ల పొంటన్న దిరిగేవు! జెర శెప్పిన పని జెయి. మేవీడ ఎండల వచ్చేస్తాంటె నీకు ఊరి మీద బడి ఎట్ల దిరుగాలనిపిస్తాందే? యిన్నవా? ఆఁ" -కూతేసినట్టు శెప్పింది సత్తెమ్మ.

"ఆఁ యిన్న యిన్న. దొడ్లెకే బోతాన-" అంటని అడుగులేసింది. తల్లి మల్ల బిల్శి మాట పాబందుగ శెప్పేతలకు ఇగ ఎటూ పోబుద్ధి కాలె బుచ్చాలుకు.

నివొద్గినె అయ్య, అవ్వ, పోశన్న ఎండల కట్టబడ్తాంద్రు. తానేమో ఆటకు బోయింది. ముంద్గాల్నె కాలమయిత లేదు. శేశిన కట్టం గంగ పాలన్నట్టు ఏం జేశినా కడ్పు నిండ్త లేదు. ఇంట్ల వొక్క గింజ దాప్కం లేదు. ఇంక తన లగ్గం జేశెటందుకు యింట్లందరు ఎంత తిప్పలు వడ్తాంద్రో?-యింట్లెవ్వరు మంచి బట్ట గట్టరు.

"పండ్గకో అంగి పట్టిచ్చో రాదుర?" అంట అయ్యెంటె-"నీ యవ్వ నాకెందుకే వొల్లంత శిట శిట! బుచ్చాలుకు లంగ దేంద్రి-" అంటన్నడు పోశన్న. ఇగ అవ్వ పెయ్యి మీద దారానికి రెండు నల్ల పూసలు, పుస్తె, పోతె ఇగేమి లేదు. గ్గా మొన్న పొలం నాటు వెడ్తాంటె మట్టెలు గూడ బురదల వొయినయి. గా శెంద్రయ్య పటేల్ పెండ్లాంకైతె గంటీలు, కత్తెరబోనీలు, దుద్దులు, కాకర్లు, తుత్తె, నాగసరం,, కమ్మలు, గుండ్లు, వొడ్డాలం, వట్టగొల్సులు, కడాలు... ఇంక శాన శాన వున్నయ్ గని-ఆల్లది వున్నోల్ల ముచ్చట. తింతాన్కి కుండల కూడే వుండదాయె. గయ్యేడొస్తయ్? గిట్ల గిట్లనే పికరు జేసుకుంట గాన్నించి బుచ్చాలు పదడుగు లేశేతలికి,

1970-72. అవి బిఎస్సీ చదువుతూ, సెలవుల్లో జానపదగీతాలు సేకరించి, 'భారతి, స్రవంతి' వంటి పత్రికల్లో వ్యాసాలు ప్రచురిస్తున్న రోజులు. తెలంగాణ భాషలో వచనకవితలు రాయడం ప్రారంభించి సభల్లో చదువుతున్న రోజులు. నాకు తెలిసిన మా వూరి వాతావరణాన్నీ, సమస్యల్నీ, జీవితాన్నీ కథలుగా మలచడానికి ప్రయత్నిస్తున్న రోజులు-అలాంటి రోజుల్లో రాసిన కథే 'యెలుగు మింగిన శీకటి.'

అప్పటికి తొలి తరం తెలంగాణా కథకులు కథలు రాయడం ఆపేశారు. మలి తరం తయారు కాలేదు. ఆ మధ్య కాలంలో నా ఈ ప్రయత్నాలు సాగాయి. అందుకేనేమో, నా తొలి రచనలకు అనూహ్యంగా మంచి గుర్తింపు లభించింది. ఇతివృత్తం బీదరికం, అణచివేతే కావచ్చు, గాక మానవసంబంధాల్నీ, వాటి మధ్య గల ఆత్మీయతల్నీ ఈ కథలో ఈస్తటిక్ వాల్యూస్‌తో చెప్పాను గనక నాకు ఇష్టం. ఈ కథలో నేను పుట్టి పెరిగిన మట్టివాసన లున్నాయి. నిబద్ధత గల ఏ రచయిత అయినా ఇష్టపడేదీ... గౌరవించుకునేదీ వాటినే కదా?

-రచయిత

శెంద్రయ్య పటేల్ బాట పొంట వొయ్యేటోడు దెబ్బకు ఆగిపొయ్యిండు-బుచ్చాలు కనిపిచ్చింది!

"ఒహో పొల్ల పెద్దగయింది ఆఁ..." అని శెంద్రయ్య వూటగనే అన్నడు.

బుచ్చాలు దబ్బున మీదికి సూశింది. 'అమ్మో, గివీడా?' అనుకున్నది. గుండెల బుగులయింది. శక్కరొచ్చినట్టయి, పక్కకు జరిగి గోడ పొంట బాటెమ్మటి బఱ్ఱ బఱ్ఱ ఉరికింది.

శెంద్రయ్యను సూశి బయపడెటందుకు, హిరన్నకాశిపుని తీర్గ ఏముండడు. గని నల్లగ బక్కగ పొడుగుంటడు. సీన్మల ఆడోల్ల నెత్కపొయ్యేటోని కుండే బుఱ్ర మీసాలు గూడ లేవు. గని కండ్లెఱ్ఱ గుంటయి, గొంతు బొంగు.

బుచ్చాలు నడిశి పోతాంటె గమ్మతు గనిపిస్తాంది-శెంద్రయ్యకు. దాని ఒయసును దాశిపెట్ట శాతగాక నోర్లు తెర్సుకున్న సిరుగులు-గ్గా మొన్న రాత్రి పేటల దొరికిన కొత్త సరుకు బాపతుది కావాల్నని వాలాయించి... యెల్లవెట్టిన సంగతి యాది కొచ్చి కుశయిండు. యెంబడే నగిండు.

సప్పుడిని, అయిలయ్య పక్కకు సూశిండు: ఊరి సర్పంచు శెంద్రయ్య పటేలు తన దిక్కే ఒస్తాండు.

సూడంగనె సూదుల్తోటి గుండె కాయ గుచ్చినట్టయింది. గని, మల్ల మీదికన్నడు -"దండమయా ఈ యాల్లప్పుడెటో ఎల్లింద్రు?"

"లేలే! ఎట్లేగని, ఏమాయె ఇంక గోడ గానేలేదులే?"

"యాడాయె పటేలా? మొన్న సురువు జేశి కచ్చు లేపంగనె ఆన పెండ్లాం ముండమొయ్య, ఆనొచ్చి గోడంత తెర్లాయె. ఇగ ఆరాలని నిన్నాకోని ఇయ్యాల వెడ్తాన" గోడ వెట్కుంటనె శెప్పిండు అయిలయ్య.

"సరె గని-బాయికి మోటరు పెట్టించుకుంటరా లేదా? నువ్వు, మీ తోటోండ్లు కూడుకోని, ఏ సంగతైంది శెప్పుంద్రి-ఇంతజాం జేస్త! మొన్నగా మన్నెం బాయి కాడ మోదుగు మారిగానికి, గంద్కం గంగన్కి మంజూరు జేపిచ్చిన. జేపిచ్చిన్నా లేదా నలుగుర్నడుగు! గా ఏనుగు అనుమయ్యకు పూడ్కె బావుల అప్పు ఇప్పిచ్చిన. నాకేమన్న ఒస్తున్నదా? ఊల్లె సర్పంచుగిరి ఉన్న కాడ్కి అందరికి మంచి జేయ్యలని నా ఖాయిషు. మోటరు వెట్టించుకోంద్రి జల్దిన. ఇగ పొంటె గొట్టంగ లేశి, మోటలు గొట్టుడుండదు" అన్కుంట సర్‌సఱ ఎల్లిపోయిండు సర్పంచు.

అయిలయ్య ఆయన్దిక్కే సూశిండు సాన సేపు. "పైస గల్లోన్ది రాజ్జెం-లాబమొగనిదైతె కట్టమొకడు శెయ్యాలె" అంట గుల్గిండు అయిలయ్య.

గోడ యివుతల్నించి పటేల్ మాటలన్ని యిని, "ఊఁ-ఎల్లవెట్టిండు తీయ్" సత్తెమ్మ యిసుక్కని యిసిరేష్టం యేస్తె, మల్ల పోయి అయిలయ్య ఈవుల వడ్డది, మన్ను ముద్ద.

అదిరిపడ్డడు అయిలయ్యఎన్కకు సూస్కని. "ఏందేయ్, నంజ మీది కోపం గుంజ మీద్దీశినట్టు, నా మీదేత్తివి? ముసల్తనానికి సర్సమాడ్తాన్నవ్?" గట్లనే ఏమేమో గులుక్కున్నడు అయిలయ్. ఈవుల మన్ను దీసుకున్నడు.

పోశాలుగాడు శిన్నగ నగిండు. సత్తెమ్మ కిసుక్కుమన్నది.

గోడ వెట్కం జోరుగ అయితాంది. వాండ్లకు అంబటాల్లప్పుడు తాగిన గెంజి, నాలుగు

## ఆరోగ్యం-ఆహారం

ఈ రెండింటికీ తెగని సంబంధం వుంది. "తిండి లేనిదే కండ లేదురా" అన్నాడు మహాకవి. కానీ ఇప్పుడు కండ లేని శరీరం కోసమే అందరికీ తాపత్రయం. స్థూలకాయం రాకుండా డయెటింగులు చేసేస్తుంటారు. కానీ తిండి తినకపోవటం వల్ల కలిగే దుష్పరిణామాలను గురించి ఆలోచించరు. ఆరోగ్యంగా వుండేందుకు శరీరానికి కావలసినవేవో తెలుసుకుంటే మనకేం కావాలో తెలుస్తుంది. వేపుళ్లు కాకుండా స్టీమింగ్, బేకింగ్, గ్రిల్లింగ్, మైక్రోవేవింగ్‌ల వల్ల ఉడికించిన ఆహారం తీసుకోవాలి. చాక్లెట్లు, బిస్కెట్లు, వేఫర్స్, కోలాలు స్నాక్స్‌గా తీసుకునేందుకు తగినవి కావు. వీటిలో చక్కెర, కొవ్వు, సోడియం ఎక్కువుంటాయి. తాజా పళ్లు, మొలకలెత్తిన ధాన్యాలు, కూరగాయలు, సాండ్ విచెస్, సలాడ్లు, పీచున్న పదార్థాలు బాగా తీసుకోవాలి. ఒక్కసారే కడుపు నిండా తినేయటం నేడు ఫాషనూ కాదు, ఆరోగ్యానికి మంచిదీ కాదు. కనుక రెండు మూడు గంటల కోసారి తేలికగా ఏదైనా తీసుకోవాలి. ఎక్సర్‌సైజులూ, డయెటింగుల కన్నా, ఇట్లా ఆహారం తీసుకోవటం వల్ల స్థూలకాయం వచ్చే అవకాశాలూ తక్కువ. ఆరోగ్యానికి ఆరోగ్యం.

ఎస్.



మెత్కులు అరిగి శాన సేపయింది. ఇగ సత్తెమ్మ ఈన్నించి వోతె, గట్కొండితే పొద్దీకి తినుడయితది. గని ఈ పని యేడిదాడ పెట్టి బొయ్యేటట్టు లేదు.

తల్లి, కొడుక్కు-ఇప్పుడెండల లేరు. మెల్లమెల్లంగ నీడ ఆల్ల మీదికి పాకొచ్చింది-గిప్డు సొంతం గోడ నీడలున్నరు.

ఉన్నట్టుండి ఒకసారి ఊల్లె ఊరోల్ల లొల్లి ఎక్వయింది. గదేం లొల్లో ఏందో అయిలయ్యకు తెల్వలె.

“వయ్యో! మంటలే... గుడిసెల్వాయెనే” అంట ఆడోల్లు, పిల్లగాల్లు మొత్తుకుంటున్న సప్పుడు యినవడి గోడ మీద కూకున్నోడల్ల దెబ్బకు నిలవడి సూశిండు. ఊరి గుడిశెలన్ని కనిపిస్తనే వున్నయ్. ఊరి నడ్మ లచ్మిగాని గుడిశె అంటుకున్నది... ఏం ఆలోచన శెయ్యకుండ ఆత్రంగ గోడ దుంకి “ఇండ్లు గాల్తానయ్ రాండ్రి!” అనుకుంట అయిలయ్య ఉరికిండు. ఉరుకంగ ఉరుకంగ తొవ్వ కెదురుంగ, దమ్మెగ బోసుకుంట బిడ్డ రాబట్టె-“ఏంద్బిడ్డ, ఏమాయెనే?”

బిడ్డకు ఏడ్పే గని మాట లొస్తలేవ్.

“పల్ల నిడుద్దా మనుకునేతలి కిక, కొట్టమంటుకున్నదే, కాల్తాంది!”

గా మాట యినంగనె అయిలయ్యకు తన బత్కు కాలినట్టనిపిచ్చింది-గుండె కాలింది. ఉరికిండు, ఊల్లె మందిని పిల్చుకుంట. గుంపులు గుంపులుగ పొయింగ్రు.

మొగోల్లు వూల్లె తక్వమందున్రు. పొద్దుగాల శెల్కల పొంటి పొయినోల్లు యింక రాలె! ఉన్నోలయితె కుండలు బిందెలు దెచ్చిన్రు బాయి కాడ్కి.

పూరి గుడిసెలు గాబట్టి మంటలు బాగ లేశినయ్. అటు యిటు అన్ని గుడిసెలకు అంటుకున్నయి-మంటలు మొగుల్ను తాకెటట్టు. ఆడోల్లు నీల్ శేదుతాండ్రు. మొగోల్లు సల్తనే వుండ్రు.

శెంద్రయ్య పటే లురుకొచ్చిండు. పటేలుది మిద్దె. దాని సుట్టు ఇంకో ఇర్వయిండ్లోల్లయి గూనయి. గవన్ని గటు గడ్డకు అలగున్నయ్. అయ్యి వొంగ గీ గుడిశెలన్ని గాలెటట్టున్నయ్.

“పొయింగ్రి... పొయింగ్రి... ఓరి కొమిరిగా! నువ్వొంద్కోని దబదబ శేదరాదుర? బుగులు పడకుండ్రి నేనున్న గద! ఊరు మంచి కోసానికి ఏమైన జేస్త. గిప్పుడే యాదగిర్ని సైకిల్ మీద పేటకు దోల్న. పైరింజనొస్తాండొచ్చు. ఆ నీల్ల కారోల్లు ఒచ్చేదాక కష్టపడి బచాయించు కుంటుండాలె! పొయింగ్రి-శాన్తాళ్లు దెచ్చి పక్క పొన చేదుగ్రి. గిర్క మీంచే అంటె ఎన్నడు గావలె? పొయ్యింగ్రి... పొయ్యింగ్రి!...”-గట్టిగ అరుస్తాండు.

సూస్త సూస్తనే అందరొచ్చింగ్రు. సల్లార్పుతాండ్రు. గని ఎంత కేమయితది? గటు గెడ్డాములాయె, సొప్పాములాయె. నీల్లు దెచ్చి సల్లెద్దాకుంటాయి? బస్సు కాలిపోతానయి. గీటు గుడిసెల కప్పింది గూడ తాటాకులాయె.

ముసలోల్లను, శిన్న పిల్లల్ను ఎత్కవోయి దూరం ఏశి వొస్తాండ్రు ఒయిసోల్లు. గా గొల్ల మల్లేశం వోల్ల పోరడు! సామి గాని పెండ్లాం మీద కాలెడ్డి మొద్దు వడ్డదంట జబ్బ మీద... వాత ఆటంగ వడ్డది. ఇగ గా సాలె బాలిగానింట్ల గట్లనే అయ్యింది. బంటు జమాల్ గాని యిల్లంత యేడికాడికి కాలి కూలింది. ఏదో కొద్దిల సావులు తప్పినయి-వాండ్ల వాండ్లు ఎవరూ సావలె.

గాడ ఎవ్వలు గూడ, గదెవ్వనిల్లు అని సోంచాయిస్తలేరు. ఇంత వరకు వాల్ల వాల్ల నడ్మ శిన్న శిన్న జగడాలు అయినా గని-అన్ని మర్శి ఆపతికాలంల గిప్పుడైతె కల్శి నీల్లు వోస్తాండ్రు.

అయిలయ్యుండె గుడిశె గూడ మంటల్తోటి నగుతాంది. అది సూశిన అయిలయ్య, సత్తెమ్మల పానాలు మసైనయ్. అయిలయ్య, పోశాలు... ఇల్లు వాండ్లందరు, ఊల్లె వాండ్లు కొందరు నీల్లు వోస్తనే వున్నరు. అందకుంట, మంటలురుకుతనే

వున్నయి. ఊరు ఊరంత లొల్లి... దేసంల అన్ని జాగలల్ల ఉన్నట్టు పేద పేదోల్ల యిండ్ల నిండ మంటలే!

శెంద్రయ్య పటేలసంటోల్లు దైర్నం జెప్తనే వున్నరు-పెద్దలు, జనానికి ఎదో ఓటి శెప్తనే వుంటరు. జనం సెప్పేది యినరు-మల్ల మాట్లాడ్తె అసలే సెప్పనియ్యరు.

"నీ యవ్వ గిది గా శెంద్రిగాని పనే! ఎవన్మీద కోపమొచ్చిందో, గుడిసెలంటు వెట్టిచ్చిండు-దొంగ బేకూబ్ గాడు-లఫంగి సన్నాసి... బాగర్ల కొడ్కు..." యిండ్లు గాలినోల్ల దాంట్ల ఎవలెవలో సెర్పంచును తిడ్తాంద్రు.

అయిలయ్య సుట్టున్న అయిదారిండ్లు అంటుకున్నయ్. సగానికెక్కువ గూడెం బూడ్దయ్యే తల్కి గనగన మన్కుంట పైరింజన్ ఉర్కొచ్చింది. దాని మీద ఒచ్చిన మన్సులు సటుక్కున దిగి, పైపులు బయటికి దీశి బాయి లేశింద్రు. ఇగ చాల్ జేసి-జెర్ర సేపట్ల అగ్గిమంట లార్పింద్రు. బూడ్దే మిగిలిచ్చిన్రు. గని వాండ్ల యేడ్పు లార్పలె. వాండ్ల బత్కులు కాల్నయ్ కాలినట్టే వున్నయ్. సల్లార్పినా సల్లారినట్టు అని పిస్త లేదు. సమదానమయిత లేదు.

అవ్, మల్ల-ఎట్లయితది గన్క? దొడ్లె జీవాలన్ని సచ్చె. మిగిల్నయ్ సుర్రసుర్ర గాలంగ బెదిరిపాయె. ఇండ్లల్ల వున్న గింజ గిరువు బట్ట గుడ్డలు ఎవుసం సామాన్లు అన్నీటి తోటి గుడిసెల్ గుడిసెలే ఉంతానికి యీలు కాకుండ ఊడ్చుకపాయె! ఎవ్వన్కుండదు బాద?

"పటేల్ సాబ్, మీ వోని తోటి మత్లబు అందంగనె లగెత్కొచ్చినం. ఔర్ మంటల్ సల్లార్సినం. సూస్కో! జెర్ర నువ్ మమ్ముల గూడ సూస్కోవాలె. మాక్కూడ కడ్పుంటది"- అంటన్నడు సల్లార్పెటందుకు వొచ్చినోల్లల్ల పెబ్బ.

"హహ్హహ్హ...అయ్యయ్య సూస్కుంట సూస్కుంట"-పెశిడెంటు నగిండు. నవ్వెట్లచ్చిందో, యాణ్నించచ్చిందో తెల్సుకోటం కష్టం.

"నా శేత్లేమున్నది? ఎవలెవలిండ్లార్పింద్రో, వాండ్లే మిమ్మలు అర్సుకుంటరు... దొర్రి గట్ట మా యింటి అరుగు మీద కూకుందురు. కల్దెప్పిచ్చిన..." పురాగ అనక్మందే

"పాపా! పటేల సాలొడ్డులాయె తాగక-నడ్వు"అనుకుంట ఒక్కొక్కలు పైరింజనోల్లు సర్పంచు అడుగుల అడుగు లేసుకుంట వొయింద్రు. ఈడ మల్లేశం కొడుకు సచ్చిండని, బంటు రాజయ్య తల్లి నడుము యిరిగిందని, బత్కేటట్టు లేదని, శేతులు కాల్లు గాలినోల్లు... వాండ్ల యింటి వాండ్లు సోకాలు బెడ్తాంద్రు.

గుడిసెల మీద నుంచి మంటలు బోయి, పొగలొస్తానయ్. ఊరోల్లు గూడ బగబగ మండిన బాదలను ఇప్పటి దాక కన్నీల్ల తోటి ఆర్పింద్రు. గిప్పుడు కుములుకుంట, మూలుక్కుంట కూకున్నరు. పొగ అసొంటిదేదో గుండె లోపట్నించి బయలెల్తాంది. వీల్లు బొబ్బలెక్కి అరుస్తాంటె, వాండ్లు తాగుకుంట పండ్ల తోటి బొక్క లిరుస్తాంద్రు.

ఇక జెర్ర గాంగనె, శెంద్రయ్య పటేలు పైరింజనోల్ల పెబ్బ ఇద్దరు ఊర్లె దిర్గుతాంద్రు. సర్పంచు శెప్తాండు, "గంత దూరంనుంచి వొచ్చింద్రీల్లు...ఈల్లకేమన్న ఒప్పజెప్పాలె. రూపాయల్దీసి పెట్టుంద్రి. సచ్చినోలను, దెబ్బల్దాకినోల్లను, కాలినోల్లనేం జూస్తరు? ఆల్లకు గట్ల గీత రాసుంది...ఈల్లను తొందర్గ సాగనంపాలె!" సెప్పుకుంట బాట పొంటి దొర లెక్క నడుత్తాండు శెంద్రయ్య.

మాట్లాడేటంద్కె సాతనైత లేదు, ఇగ మర్ల వడ్తారు? సర్పంచు శెంద్రయ్య సర్పమసొంటోడు. పొంగ ఎవ్వలేడ్పు లొల్లకున్నయ్.

ఒక్క రాజయ్యేడిగిండు, దైర్నం జేసి, "ఇగ మా తానేమున్నయ్ పటేల మా పానాల్దప్ప?" ఏడ్సుకుంట.

"గయ్యే ఇయ్యి. మల్ల-పెండ్లాం లేదుర, దాన్నమ్మి పైస దే!" ఇంక బగ్గ శెడ్డ మాటలు తిట్టిండు.

నోరు గల్లోన్ది ఊరు గదా మల్ల?

సచ్చిన పీన్గను గాలవెట్టేటంద్కు, వొల్లు గాలినోల్ల బాగ జేయించెటంద్కు కొత్తల్లేవు. ఇగ గీల్ల కిచ్చెటంద్కేన్నించొస్తయ్ వాండ్లకు?

గట్ల అరుసుకుంటనే అయిలయ్య తానికొచ్చిండు. "సూడు అయిలయ్య, మంటల్గిట్ట ఆపుజేశిన సాబ్‌లొచ్చిన్రు. ఆల్లు సల్లార్పకుంటె ఈ ఆవతిల ఆదుకోకుంటె, మనమంత యాడుందుం? ఆల్లకు మనం రునపడివున్నం. ఎంతనన్న ముట్టజెప్పుకోవాలె. తయారు జెయ్."

"తయారు జేశెటంద్కేమున్నది? నీ కాల్లు మొక్కుత. పెండ్లాం పుస్తె మిగిలిచ్చి..."

"గదైతె గదే సంయ్. ఇయ్యాలె! మల్ల వీండ్లు ఉత్తగ వోతారు? గిది ఎవ్వల్కి తప్పది. ఉన్నోన్ని లేనోన్ని సమానంగ జూస్త. అందరి తాన ఒసూలు జేస్తానం. ఎల్లకుంటె ఇగో, వీండ్ల వాలొచ్చి ఏద్దొరికితె గదే తీస్కపోతరు" కదిలిండు పటేలు.

పైరింజనాయిన శిన్నగ నగిండు-ఊక్కుంట పటేలెన్క పోతాండు.

"నీ యవ్వ దునియ! పుస్తెలయిన సరే ఇయ్యమనే అరిచ్చంద్రులున్న రియాస్లేవు-థూ!" అనుకున్నడు అయిలయ్య.

సత్తెమ్మ, పోశాలు కొట్టం కాడున్నరు. కాలి నింట్ల ఏమేమున్నయో దేవులాడ్తాంది బిడ్డ బుచ్చాలు.

పక్క గుడిశె కాడ గిట్లనే బెదిరిత్తాంద్రు ఈన్నించి వొయినోల్లు!

కడ్పుల పేగులేడుస్తున్న సప్పుడయితాంది.

"గిదొక్కటే వున్నదే నాయిన!" ఏడ్పు గొంతుతోటి అనుకుంట, లంగ మీదికి చెక్కు కోని, కాలిన కట్టెలూ, బూడిద, శెత్త, దాటుకుంట కాలి నింట్ల నించి బయటికొస్తాంది బుచ్చాలు.

అవుతల వాండ్లు, పీన్గల సుట్టు నక్కల్దిరిగినట్టు, గుడిసెలన్ని తిరుగుతనే వున్రు.

గుడిసెలు కాలినోల్ల బత్కులు గిట్లయిన యని, కండ్ల వడెటట్టు, గట్కు కుండది వల్గిన బోకె -బుచ్చాలు శేతుల వున్నది.

■

